ప్రజాశక్తి

బుధవారం 9 నవంబర్ 2022

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



విజయవాడలోని గాంధీహిల్ పైనుండి చంద్రగ్రహణాన్ని వీక్షిస్తున్న ప్రజలు; అంతర్‌చిత్రాల్లో....టెలిస్కోప్‌నుండి వీక్షిస్తున్న విద్యార్థిని, చంద్రగ్రహణం దృశ్యం

కనువిందు

◆గాంధీహిల్ నుండి చంద్రగ్రహణం వీక్షణం ◆దుర్గగుడి మూసివేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పాక్షిక చంద్ర గ్రహణాన్ని విజయవాడ వాసులు ప్రత్యక్షం చూశారు. టెలిస్కోప్ ద్వారా వీక్షించిన ప్రజలకు చంద్రగ్రహణం కనువిందు చేసింది. ప్రత్యక్షంగా వీక్షించిన ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం 5 నుండి 6:30 గంటల వరకు నగరంలోని గాంధీ హిల్‌పై చంద్రగ్రహణం వీక్షణకు ఏర్పాట్లు చేశారు. డాక్టర్ రాధాకష్ణ, ఇంగ్లాండ్ నుండి వచ్చిన సైంటిస్ట్ స్వాన్, పద్మ, ఉమా తదితరులు నాలుగు టెలిస్కోప్‌ల ద్వారా ప్రజలు వీక్షించే అవకాశాన్ని కల్పించారు. అప్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఢిల్లేశ్వరరావు, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ మైనం హుస్సేన్, అప్‌కాస్ట్ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం సిబ్బంది సహకారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, గాంధీ హిల్ ఫౌండేషన్, స్టార్ గేజర్స్ విజయవాడ వారి సహకారంతో ఈ ఏర్పాట్లు చేశారు. విజయవాడ చుట్టుపక్కల ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి చంద్రగ్రహణాన్ని వీక్షించారు. అయితే గ్రహణం మాత్రం సాయంత్రం 6 గంటల నుండి మాత్రమే కనిపించింది. ఎందుకంటే అంతకుముందు ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉండడంతో (మిగతా 6లో)

విమానాశ్రయ నిర్వాసితుల ధర్నా

◆విషం తాగుతామని బాటిల్ పట్టుకుని మహిళల హెచ్చరిక

◆ప్రభుత్వ తీరుపై మండిపాటు



విషం బాటిల్ చూపిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - గన్నవరం : "ఇళ్లు కూల్చి మూడేళ్లవుతోంది. కొత్తగా ఇల్లు కట్టించి ఇవ్వలేదు. స్థలాలు చూపలేదు. రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పి పట్టాలు కూడా ఇవ్వలేదు. మురుగు కాల్వ పక్కన ఉంటూ దోమలతో అష్టకష్టాలూ పడుతున్నాం. అద్దె డబ్బులివ్వడం లేదు. ఇల్లు కట్టుకునేందుకు ఇస్తామన్న డబ్బులివ్వడం లేదు. ఆర్ అండ్ ఆర్ స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రభుత్వం మమ్ములను దగా చేస్తోంది" అంటూ మంగళవారం దావాజీగూడెం రోడ్డుపై విమానాశ్రయ నిర్వాసితులు రాస్తారోకో చేశారు. మహిళలు విషం డబ్బా తీసుకొని ప్రభుత్వం స్పందించకపోతే తాగి చచ్చిపోతామని హెచ్చరించారు. రహదారిపై గంటల తరబడి రాస్తారోకో చేయడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే గన్నవరం పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రంగప్రవేశంతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. ఈసందర్భంగా పోరాట కమిటీ నాయకులు తిరువీధి యేసు రత్నం, తంబి మాట్లాడుతూ మూడేళ్ల నుండి ప్రభుత్వం తమను అధికారుల చుట్టూ తిప్పుకుంటుందేతప్ప తమ సమస్యలు పరిష్కరించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి రూ.9 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి అద్దెలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున అద్దె డబ్బులు రావాల్సి ఉందన్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోవడంలేదని కన్నీరు పెట్టారు. మురుగునీరు తాగాల్సిన దుస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వేడుకున్నారు. తమ సమస్యను చెప్పుకునేందుకు సీఎం వద్దకు తీసుకెళ్లాలని లేకపోతే సీఎంను ఇక్కడికి (మిగతా 6లో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ఫిష్ రిటైల్ అవుట్లెట్లు ఏర్పాటు

◆ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో ఫిష్ రిటైల్ అవులెట్లను ఏర్పాటు చేసి మత్స్య సంపదకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, తద్వారా వినియోగదారులకు తాజా ఉత్పత్తులను అందించడంతోపాటు మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంపై జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఫిష్ రిటైల్ అవులెట్లు, ఫిష్ రిటైల్ మార్కెటింగ్ హబ్‌లు, ఫిష్ కియోస్కా, ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్ త్రీ వీలర్ మోటర్ సైకిళ్ల పంపిణీ, లైవ్‌ఫిష్ అమ్మక కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలకు సబ్సిడీపై ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఆయా పథకాలకు అభ్యర్థుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను (మిగతా 6లో)

డొంక రోడ్లకు మోక్షమెప్పుడో ?

◆రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు◆రూ. 44 కోట్లు విడుదలైనా ప్రారంభంకాని పనులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రహదారుల మరమ్మతులంటేనే కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. టెండర్లు దాఖలు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు. కృష్ణాజిల్లాలో డొంక రోడ్ల మరమ్మతులకు రెండుసార్లు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు బిడ్డింగ్ వేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిస్థితుల్లో అస్తవ్యస్తంగా మారిన డొంక రోడ్లకు ఎప్పటికి మోక్షం కలుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 175 కిలోమీటర్ల విస్తీర్ణంలోని గ్రామీణ రహదారుల మరమ్మతులకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరు చేసింది. 102 పనులకు రూ.43.99 కోట్లతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం రెండుసార్లు టెండర్లు ఆహ్వానించింది. తాజాగా టెండర్లు తెరిచారు. గన్నవరం నియోజకవర్గంలో రూ.7.46 కోట్ల విలువైన 10 పనులకు మాత్రమే కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. మిగిలిన పనులకు కాంట్రాక్టర్లెవరూ ఆసక్తి చూపలేదు.

నియోజకవర్గాల వారీగా ఇలా

మచిలీపట్నంలో 10 పనులకు రూ.3.61 కోట్లు, అవనిగడ్డలో 20 పనులకు రూ.7.04 కోట్లు, పెడనలో 12 పనులకు రూ.7.38 కోట్లు, గుడివాడలో 16 పనులకు రూ.3.98 కోట్లు, పామర్రులో 20 పనులకు రూ.7.25 కోట్లు, పెనమలూరులో 14 పనులకు రూ.7.27 కోట్లు, గన్నవరంలో 10 పనులకు రూ.7.46 కోట్ల చొప్పున మొత్తం 102 పనులకు రూ.43.99 కోట్లు నిధులు మంజూరు



చేశారు.

నిధులున్నా డొంకరోడ్లు పట్టించుకోరు

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వ్యవసాయ ఉత్పత్తులపై సెస్ వసూళ్లతోపాటు గోడౌన్లను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఈవిధంగా వసూలు చేసిన సెస్ జిల్లాలో రూ.79.52 కోట్లు నిల్వలున్నాయి. సాధారణంగా ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఉపయోగపడే డొంక రోడ్లను రబ్బీసు రోడ్లుగా, తారురోడ్లుగా అభివృద్ధి చేయాలి. గత మూడున్నరేళ్లలో జిల్లాలోని ఒక్క డొంకరోడ్డు కూడా అభివృద్ధికి నోచుకోలేదు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నగర పంచాయతీ పరిధిలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ మునగచర్ల లే అవుట్ మరియు సచివాలయాలు, పల్లగిరి గట్టు వద్ద నున్న డంపింగ్ యార్డ్ ను మంగళవారం ఆకస్మికముగా తనిఖీ చేశారు. అనంతరం పల్లగిరి గట్టు వద్ద నగర పంచాయతీ డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన విండ్రో కంపోస్ట్ ప్లాంట్ సందర్శించి తడి-పొడి చెత్తను వేరుచేయటం విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఎనర్జీ ప్లాంట్ కి వెళుతున్న ఎన్ని టన్నుల డ్రై వెస్ట్ వెళుతున్నది వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సెక్రెటరీల మూమెంట్ రిజిస్టర్లు, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. అనంతరం అనసాగరం,మునగచర్ల, హనుమంతుపాలెం లేఔట్ల గృహ నిర్మాణాల పురోగతి పై నేరుగా లేఅవుట్లను పరిశీలించారు. లబ్దిదారులు అందరూ ప్రతి ఒక్కరూ వేగవంతంగా ఇంటి నిర్మాణము చేపట్టే విధముగా వారిని మోటివేట్ చేసి, త్వరితగతిన గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని తెలిపారు. గృహ నిర్మాణాలు దగ్గర మౌలిక సదుపాయాలు ఇదివరకే కల్పించటం జరిగినది అని, వారికి అవసరమైన సిమెంట్, స్టీల్ సకాలంలో అందించాలని సూచించారు. లబ్దిదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన భాధ్యత అధికారులుపై


నందిగామలో ఇళ్లస్థలాల లేఅవుట్లను పరిశీలిస్తున్న జెసి


ఉందని తెలిపారు. ఆ తరువాత నగర పంచాయతీ పరిధిలోని కాకాని నగర్-2, రామన్నపేట రోడ్డు లో వున్నటువంటి సచివాయలను తనిఖీ చేయటం చేశారు. ప్రజలకు అందించే సర్వీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క సర్వీసు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్క అర్జీని ఫీల్డ్ నందు తనిఖీ చేసి క్లోజ్ చేయాలని సూచించారు. అంతేకాకుండా సచివాలయాల పరిధిలో ఉన్నటువంటి స్కూళ్లను విధిగా మహిళా పోలీసులు మరియు వెల్ఫేర్ సెక్రటరీలు, ఎమినిటిస్ సెక్రెటరీలు, డేటా ప్రాసింగ్ సెక్రటరీలు, ఎఎన్ఎం, సెక్రటరీలు విధిగా ఎప్పటికప్పుడు సందర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ ఎస్.జయరామ్, నందిగామ మండల తహసీల్దార్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్ కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్ల సమస్య ఉందని, దాన్ని పరిష్కరిస్తామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 47వ డివిజన్‌లోని 151వ సచివాలయం పరిధిలో 131వ రోజు మంగళవారం నాడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ఆయా ప్రాంతాలలో పర్యటించి గడప గడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఈ డివిజన్‌లో కొంత మెట్లు డ్రెయిన్లు సమస్య వుందని, వాటిని త్వరితగతిన అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా, బాబు డివిజన్ నాయకులు కార్యకర్తలు, శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్, నాయకులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా) తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ మండలి సభ్యునిగా కర్లపాటి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రెండు దశాబ్దాలుగా అనేక రంగాలలో విశేష సేవలు అందిస్తున్న స్థానిక స్వచ్ఛంద సంస్థ కర్లపాటి చారిటబుల్



ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావును జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యునిగా నియమిస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ వినియోగదారుల చట్టం 2019 అమలుకు సంబంధిత శాఖలతో కలిసి కషి చేయనున్నట్లు తెలిపారు. చట్టంపై విద్యార్థులకు, యువతకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కలగజేయునున్నట్లు ఆయన తెలిపారు. కర్లపాటిని ఎంపిడిఓ జయచంద్ర గాంధి, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ పలువురు అభినందించారు.

సివి రామన్, క్యూరీ జయంతి

ప్రజాశక్తి-తిరువూరు: జెవివి తిరువూరు శాఖ ఆధ్వర్యంలో మానవాళి గర్వించే శాస్త్రవేత్తలు సి.వి.రామన్, క్యూరీల జయంతిని తిరువూరు



విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇరువురి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా కోకిలంపాడు ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కె.రవికిరణ్ మాట్లా డుతూ మనదేశంలో విజ్ఞాన శాస్త్రంలో మొదటిసారిగా నోబెల్ బహుమతి పొంది దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసిన గొప్ప శాస్త్రవేత్త సి.వి.రామన్ అన్నారు. ఆయన కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌ను ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28న మనమంతా జాతీయ సైన్స్ దినోత్సవం గా నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధం గా ఒక్క నోబెల్ బహుమతి పొందడమంటేనే గొప్ప అనుకుంటామని, అలాంటిది రెండు సార్లు నోబెల్ బహు మతి అందుకున్న అపూర్వ మహిళా శిరోమణి క్యూరీ అన్నారు. తన ప్రాణా లకు ముప్పు అని తెలిసి కూడా రేడి యో ధార్మికత ప్రయోగాలు చేసి మర ణించిన మేడం క్యూరీ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని ,ఇటువంటి గొప్ప శాస్త్రవేత్తల జయంతులు నిర్వ హించడం మన భాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెకుముకి కన్వీనర్ ఎం.హరికష్ణ, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, తిరువూరు ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మధు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

నేటి నుండి క్రీడా సంబరాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ నందు జగనన్న క్రీడా సంబరాలు నేటి నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా మంగళవారం గ్రౌండ్ ను జగ్గయ్యపేట మున్సిపల్



చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు ఆకుల బాజి, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ వట్టెం మనోహర్ పరిశీలించారు.

కలెక్టర్ పట్ల అనుచిత ప్రవర్తనపై నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 7న జరిగిన స్పందన కార్యక్రమములో జే.సి.ప్రభాకర రెడ్డి అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పై అనుచిత ప్రవర్తన పై మంగళవారం మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు జగ్గయపేట మండల రెవిన్యూ అధికారులు, మెడికల్, హౌసింగ్, ఎంజీ.ఎన్.ఆర్.జీ.ఎస్, పంచాయతీ రాజ్ మరియు సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రము చేశారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివద్ధి అధికారి టి.ఎస్.జయచంద్ర మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పై జే.సి.ప్రభాకర రెడ్డి అలా ప్రవర్తించటం మంచి పద్దతి కాదని, ఉద్యోగుల పై రాజకీయ ఒత్తిడి సరి అయినది కాదని తెలిపారు. ఈ సందర్భంగా జే.సి.ప్రభాకర రెడ్డి చిత్ర పటాలను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమములో జగ్గయపేట తహసిల్దార్ కె.నాగేశ్వరరావు,



హౌసింగ్ ఏఈ ఎం,వి,ఎస్, ప్రకాశ రావు, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీనివాసరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి వై.ఎస్.మాధవ శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఆర్.రాణి, టైపిస్ట్ జి.లక్ష్మి తిరుపతమ్మ, సీనియర్ పంచాయతి సెక్రటరీ సుబ్బారావు, ఎ.శ్రవణ్‌కుమార్, సిహెచ్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వీరులపాడు: అల్లూరు గ్రామానికి చెందిన వేమురి సురేష్ (37) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణ భారమై తెచ్చిన అప్పులు తీర్చేందుకు దారి లేక ఆదివారం పెద్దాపురం గ్రామ శివారు పొలంలో పురుగు మందు తాగాడు. కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురేష్‌ను హుటాహుటిన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్ పరిస్థితి విషమించడంతో మంగళవారం

అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి

ప్రజాశక్తి-మైలవరం: పొందుగల గ్రామానికి చెందిన అరిగి రమేష్ (26) అదే గ్రామానికి చెందిన ఝాన్సీని మూడేళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. సోమవారం రాత్రి భార్య, భర్తలు గొడవపడ్డారు. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపం చెందిన రమేష్ ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తలుపులు తెరవగా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించడంతో ఇరుగుపొరుగు వారి సహాయంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

కొండపల్లి ఐడిఎలో కెమికల్ వ్యర్థాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి ఐడీఏ లోని రేకుల కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా స్థానిక ప్రజల పరిస్థితి అయోమయంగా తయారైంది. ప్రాణాంతక విష వ్యర్థాలతో స్థానిక ప్రజలు కేన్సర్ బారిన పడే దుస్థితి నెలకొంది.. అత్యంత ప్రమాదకరమైన కెమికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వదులుతున్న కంపెనీ యాజమాన్యం ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడుతున్నారు.. కొండపల్లి క్వారిలకు వెళ్లే మార్గంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డు లో రేకుల కంపెనీ యాజమాన్యం విష వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు.. రేకుల తయారీకి వినియోగించే అత్యంత ప్రమాదకరమైన ఫైబర్ వ్యర్థాలు నిబంధనలకు అనుగుణంగా డంప్ చేయాలి కానీ నిర్వాహకులు జనసంచారం ఉండే అతి సమీప ప్రదేశాలలో డంపింగ్ చేస్తుండంతో స్థానికులు ఆందోళనకు గురి అవుతున్నారు. రేకులు కంపెనీ వ్యర్థాలతో ఇప్పటికే ఐడీఏ బూడిద మయం కాగా ఇప్పుడు ప్రాణాంతక వ్యర్థాలు సైతం చెత్త డంపింగ్ యార్డ్‌లో వేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. వర్షం పడితే వ్యర్థాలు నీటి రూపంలో సమీప పంట కాలువలో కలిసే అవకాశం ఉండటంతో పంట కాలువ ల ద్వారా జనవాసాల్లోకి వెళితే



భూమిలోకి ఇంకితే భూగర్భ జలాలు కలుషితం అయి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు..గతం లో కూడా ఇదే తరహాలో కెమికల్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో డంపింగ్ చేస్తే యాజమాన్యంపై ఫిర్యాదులు వచ్చాయి. అయితే మళ్లీ ఇప్పుడు అదే తీరును వ్యవహరిస్తున్న కంపెనీ యాజమాన్యంపై ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళనకు దిగేందుకు సిద్దం అవుతున్నాయి. కాలుష్య కొరల్లో ఉన్న కొండపల్లి వైపు కనీసం కాలుష్యం నియంత్రణ మండలి అధికారులు చూడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: డిజిటల్ చెల్లింపులను సులభంగా చేసేందుకు వినియోగదారులకు అవగాహన కల్పించే విధంగా అమెజాన్ ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు అమెజాన్ పే హోల్‌టైమ్ డైరెక్టర్ వికాస్ బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో వినియోగదారులు ఎక్కువ మంది డిజిటల్ పేమెంట్స్ పట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న వ్యాపారస్తులకు కూడా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అవగాహన కల్పించి ప్రోత్సహించే ఉద్దేశంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని డిజిటల్ చెల్లింపులు చేసే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

రజకుల ఆత్మగౌరవ దీక్షకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: రజక సామాజిక వర్గం మీద దాడులు, రజక వత్తిలో ఉన్న మహిళపై జరుగుతున్న అత్యాచారాలు లైంగిక వేదింపులు, గ్రామ బహిష్కరణలు జరగకుండా ఉండాలంటే దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నట్లు రజకులను ఎస్.సి జాబితాలో చేర్చాలంటూ విజయవాడ ధర్నా చౌక్‌లో రజక నాయకుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు (గుంటూరు) ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా 'రజకుల ఆత్మగౌరవ దీక్ష' కు విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఇచ్చిన సూచన మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి చెందిన 20 సామాజిక వర్గాల నాయకులు మంగళవారం మద్దతుగా బ్యానర్ చేతబట్టి ర్యాలీగా తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎమ్ ఎస్ బేగ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, రజక సాధికార సమితి నాయకులు సురభి బాలు ప్రసాద్, సారిపల్లి వెంకట రాధాకష్ణ, ధనేకుల వెంకట సుబ్బారావు, షేక్ హబీబ్, పల్లంటి గంగాధర్, బెవర సాయి సుధాకర్, డివిజన్ పార్టీ అధ్యక్షులు పిళ్ళ సుదర్శన్, వడ్డాది రమణ, కే ఎస్ ఆర్ శర్మ,షేక్ సుభానీ, సందక సురేష్, దేవర కొండ చక్రవర్తి , నీలం మనోజ్ కుమార్, కుప్పుల గంగాధర్ రెడ్డి, ఈది నాగేశ్వరావు, ఆళ్ళ మోహనరావు, రావూరి సత్యనారాయణ, సందక సురేష్ టీమ్ పాల్గొని సంఘీభావం పలికారు.

గ్రహణంతో ఆలయాలు మూసివేత

ప్రజాశక్తి-మోపిదేవి

చంద్ర గ్రహణం సందర్భంగా మంగళ వారం మండల పరిధిలోని పలు దేవాలయాలు మూసివేశారు. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఉదయం7గంటల నుండి పూర్తిగా మూసి వేశారు.దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారి ఆలయం మంగళ వారం ఉదయం 7గంటలకు ఆలయ అర్చకులు బుద్ధ వర ప్రసాద్ శర్మ మూసి వేశారు.కోసూరువారి పాలెం శ్రీ కోదండ రామాలయం,శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం, కె కొత్త పాలెం, పెదప్రోలు,నగాయ తిప్ప,చిరువోలు లంక,తదితర గ్రామాల లోని దేవాలయాలు మంగళవారం మూసి వేశారు. ఆయా ఆలయాలు సంప్రోక్షణ అనంతరం, బుధవారం ఉదయం 8గంటల నుండి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయం, పెదకళ్లే పల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి ఆలయం లోను,తిరిగి యధావిధిగా దర్శనము, సేవలు యధావిధిగా కొనసాగుతాయని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రదర రావుతెలిపారు.మండల పరిధి లోని మూసి వేసిన ఆయా ఆలయాలు బుధవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తిరిగిదర్శనం కల్పిస్తారని ఆ యా ఆలయాల ధర్మకర్తలు ,అర్చకులు తెలిపారు.

తగ్గిన యాత్రీకుల రద్దీ

మచిలీపట్నం రూరల్ : చంద్రగ్రహణం తో పాటు మంగళవారం కావడంతో ఆలయాలు కూడా మూసి వేశారు. డ్వామా పిడి, మండల ప్రత్యేక అధికారి జి వి సూర్యనారాయణ బీచ్‌లో ఏర్పాట్లను బందరు ఆర్డీవో ఐ.కిషోర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ మంగినపూడి బీచ్ సందర్శకులకు ఏర్పాట్లను పక్కద్బందీగా చేశామన్నారు.గ్రహణం రోజు కూడా సుమారు 25 వేల మంది వరకు స్నానాలు ఆచరించారన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), కలెక్టర్ రంజిత్ భాష ఆదేశాల మేరకు సముద్ర స్నానాల బందోబస్తు కు పోలీసులు, ఎన్ సి సి క్యాడెట్ల తో పాటు 500 మంది సిబ్బందిని, శానిటైజేషన్‌కు 200 మంది, మెడికల్ 100 మంది, వాలంటీర్లు 250 మందిని నియమించామని తెలిపారు. ఐదు చోట్ల త్రాగునీరు, మూడు చోట్ల ఉచిత మెడికల్ క్యాంపులు,రెండు చోట్ల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న పిల్లలకు పాలు,వృద్ధులు, వికలాంగులకు కోసం ఉచితంగా ఆటో ఏర్పాటు చేశారు. బీచ్‌లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మత్స్య, అగ్నిమాపక శాఖలు తమ సిబ్బందిని సేవలు వినియోగించారని,వైద్య శాఖ ద్వారా ఉచిత అంబులెన్సులు ఏర్పాటు చేశాయన్నారు. స్నానాలాచరించే వారు సముద్రం లోనికి వెళ్లకుండా పోలీసు,మెరైన్ పోలీసులు పహారా నిర్వహించారు.మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగినపూడి బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డిపిఒ నాయక్, తహశీల్దార్ డి.సునీల్ బాబు, టూరిజం అధికారి రామ్‌లక్ష్మణ్, మాజీ సర్పంచ్ వి.రవిశంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కోడూరు :** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హంసలదీవి సముద్రం తీరంవద్ద భక్తులు పుణ్యస్నాలను ఆచరించారు. మహిళలు సముద్ర తీరం వెంబడి కార్తీక దీపాలను వెలిగించారు.

హంసలదీవిలోని శ్రీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారిని దర్శించుకున్నారు.



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న విసి ఆచార్య కెబి చంద్రశేఖర్

ఎంసిఎ, ఎంఎస్‌సి ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల పీజీ ఎంఎస్‌సి మ్యాథ్స్-4 ఎంసిఎ -4 సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.బి.చంద్రశేఖర్ మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సి.బ్రహ్మాచారి, పరీక్షల సమన్వయ కర్త డాక్టర్ ఎల్.సుశీల, యూనివర్శిటీ కళాశాల ప్రిన్స్‌పాల్ వై ఏ మారుతి, ఆర్‌డీ డీ ఎస్ సీ జయలక్ష్మి, పరీక్షా విభాగం ఇతర సిబ్బంది పాల్గొన్నారు. మిగతా వివరాలను, తేదీలను విశ్వవిద్యాలయ వెబ్సైట్‌లో పొందుపర్చామని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి‌బ్రహ్మాచారి తెలిపారు.

విద్యుత్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-ఉయ్యూరు

గండిగుంట పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్లను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె. ప ద్మ జనార్ధన్ రెడ్డి మంగళవారం తనిఖీచేశారు. గండిగుంట, ఉయ్యూరులో సబ్ స్టేషన్లతో పాటు ఈఈ కార్యాలయం, ఏడీఈ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీచేసి వివరాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఉయ్యూరు డివిజన్ ఈఈ రాంబొట్లు, ఏడీఈ రామకష్ణ, పట్టణ, రూరల్ ఏఈలు జేఎన్‌ఎం రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్‌టిల్లో చేర్చాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ వడ్డెర కులస్తులు మంగళవారం మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ పార్టీ తరపున కృషిచేస్తామని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు చిన్న నరసింహులు, శివరాత్రి నాగరాజు, శివరాత్రి రాముడు, ఆలకుంట వీరన్న, గుంజా వీరబాబు, వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పెత్తనంపై నాయీ బ్రాహ్మణుల నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ

క్షౌరశాలల్లో కార్పొరేట్ పెత్తనం మాపై వద్దంటూ అవనిగడ్డ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తరతరాలుగా వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. రిలయన్స్ అంబానీలకు, ఆదానీలకు కార్పొరేట్ బ్యూటీ పార్లర్లకు అనుమతి ఇస్తుండటం దారుణమన్నారు. ఇప్పటికే 600 పైగా ఉన్నాయనీ, మరో 3000కుపైగా ప్రతి మండల కేంద్రంలోనూ పెట్టుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకుంటున్నారన్నారు. దీనిని క్షౌర వృత్తిదారులంతా తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షలకు పైగా ఉన్నారన్నారు. తమ పొట్టలు కొట్టేలా బహుళజాతి సంస్థలకు అనుమతి ఇవ్వొద్దని ముక్తకంఠంతో కోరారు. బ్యూటీ పార్లర్లు వస్తే తమ దుకాణాలు మూతపడి తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆమనగడ్డ బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు ఆమనగడ్డ శివయ్య, కార్యదర్శి రమేష్, జాయింట్ సెక్రెటరీ శ్రీనాథ్, వృత్తి సంఘాల నాయకులు ఎన్.రంగారావు, యూనియన్ నాయకులు ఎం.నరేంద్ర కుమార్, ఎ.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు



ధర్నాలో పాల్గొన్న వృత్తిదారులు



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, ఇతర సిబ్బంది, ప్రజాప్రతినిధులు

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనల నిమిత్త బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కెఎస్‌ఆర్కే ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు సెల్ : 9959224796కు ఫోన్ చేయాలని కోరారు.

అందరికీ ఆరోగ్య సేవలే లక్ష్యం

ప్రజాశక్తి-పమిడిముక్కల

అందరికీ ఆరోగ్య సేవలను అందించటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మేడూరు కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు మెనిగూరి శ్రీనివాసరావు అన్నారు. పమిడిముక్కల మండలంలోని మేడూరు కోఆపరేటివ్ బ్యాంకులో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ, కామినేని హాస్పిటల్ వారి సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలందరికీ పూర్తిస్తాయిలో వైద్య సేవలను అందించటానికి రాష్ట్రప్రభుత్వం కుటుంబ వైద్యాన్ని ఏర్పాటుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో లోయ శంకర్ ప్రసాద్, లోయ ప్రసాద్, వంశీకృష్ణ, ఎంపీటీసీ, వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న టిడిపి నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ

వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్రీకాకుళం, విజయవాడ ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డ రాజీవ్ చౌక్ వద్ద టిడిపి నాయకులు బైఠాయించి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో తండ్రీ కూతురిని సజీవ సమాధి చేసేందుకు ప్రయత్నం చేసిన వారినీ, విజయవాడలో మైనర్ బాలికపై అఘాయిత్యం చేసిన కామాంధుడిని తక్షణమే శిక్షించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసి దిశ చట్టాన్ని తెచ్చిందన్నారు. ఎంతమంది బాధితులకు న్యాయం చేసిందో చెప్పాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను చూడలేని మహిళా కమిషన్ ఎందుకని ప్రశ్నించారు. కేవలం తాడేపల్లి నుండి స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదని ఏమైనా మహిళల పట్ల సానుభూతి ఉంటే వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు ఘంటసాల రాజమోహన్రావు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బర్మా శ్రీనివాసరావు, గుంటూరు వినయ్, దాసినేని శ్రీనివాసరావు, మెగావత్ గోపి, పుల్లగూర రాజేంద్రరావు, యలవర్తి చిన్న, కొల్లూరి ఇమ్మానియేల్, యాసం శ్రీరాములు, తుంగల శ్రీనివాసరావు, గరికపాటి హరి, బచ్చు మురళి, గుడివాక మల్లికార్జునరావు, పులిగడ్డ నాంచారయ్య, మేడికొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు

ఆకునూరులో అతిసార

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఆకునూరు అంబేడ్కర్ నగర్లో డయేరియా ప్రభలడంతో అధికారులు అప్రమత్తమై వైద్యశిబిరం ఏర్పాటుచేసి ఇంటింటా సర్వే నిర్వహించారు. కాలనీలో రెండు రోజులుగా కొంతమంది విరేచనాలు, వాంతులతో బాధ పడుతున్న నేపథ్యంలో సోమవారం కాలనీలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారధికి స్థానికులు తెలిపారు. వైద్యశిబిరం ఏర్పాటు, బాధితులకు అందుతున్న వైద్యం వివరాలు వైద్యఆరోగ్య సిబ్బందినుంచి తెలుసుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి గీతాబాయితో ఫోన్ ద్వారా మాట్లాడారు. డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాచారం అందుకున్న ఆమె గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సరఫరా చేస్తున్న త్రాగునీటిని ఫరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించి మరో ట్యాంకు నీటిని సరఫరా చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణపరమాత్మ తెలిపారు.

అసత్య ప్రచారాలను ఎంఎల్‌ఎ మానుకోవాలి : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ

జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గురువాక శేషుబాబు కోరారు. జనసేన పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు పవన్ కళ్యాణ్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. జనసేన ఒక కులానికి చెందిన పార్టీ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కాపు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం రాకూడదనేది ఎమ్మెల్యే అభిప్రాయం లాగా కనిపిస్తోందన్నారు. వైసిపి కూడా ఒక కులానికి చెందిన వారసత్వ, కుటుంబ పార్టీ అని గుర్తుపెట్టుకోవాలన్నారు.



సమస్యల పరిష్కారానికి విశాల ఉద్యమం : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి-వత్సవాయి: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, సమస్యల పరిష్కారం కోసం విశాల ఐక్య ఉద్యమం నిర్మిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో సిఐటియు మండల ఏడో మహాసభ నాయకులు టి.మధుకుమారి అధ్యక్షతన జరిగింది. సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాల ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో, రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యవసాయ నిర్మాణ రంగాలు, చేతివృత్తులు దెబ్బతిన్నాయన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోయారన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేతుల్లో పెట్టి ప్రజలపై మరిన్ని భారాలు మోపుతున్నారన్నారు. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికి దిగజారిపోతుందన్నారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా 11వ మహాసభ విజయవాడలో డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ కార్మికులకు, స్కీం వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్స్‌కి పనిభారం తగ్గించాలని కోరారు. సభలో కార్యదర్శి బి.రాము నివేదిక ప్రవేశపెట్టగా ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 11 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నీలం అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా బి.రాము, కార్యదర్శిగా టి.మధుకుమారి, ఉపాధ్యక్షురాలిగా జీ.నాగేశ్వరీ, కోశాధికారిగా ఏ.ఈశ్వరమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్.హన్మంతరావు, సైదమ్మ, జక్కుల శ్రీను, రైతు సంఘం నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆంజనేయులు

'ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి'

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ధాన్యాన్ని ప్రభుత్వమే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలబడాలని ఎపి రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. రెడ్డిగూడెం అమరభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో వరి పైరు కోత దశలో ఉందని, చేతికి వచ్చిన పంటను ప్రభుత్వమే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి 15 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎం మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు అప్పిరెడ్డి, మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, కష్ణారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో మంగళవారం వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద మొబైల్ అన్న క్యాంటిన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుర్‌మీరా, నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, గణప రాము, కామా దేవరాజు, ఈగల సాంబ, తుపాకుల రవణమ్మ, బూదాల నందకుమారి, పేరం సత్యనారాయణ, రాజగిరి అశోక్, పిల్ల సాయి తదితరులు పాల్గొన్నారు.






అమ్రితసాయి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: పరిటాల పరిధిలోని అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చెన్నై కు చెందిన యల్ క్యూబ్ ఇన్నోవేషన్స్‌లో ఉద్యోగాలు సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.రామ్మోహనరావు తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు రాజ్ నారాయణ్ బృందం, కళాశాల బిటెక్ ఫైనలియర్ సియస్సి, ఈసీఈ విద్యార్థులకు రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ మరియు హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందిని ఎంపిక చేశారని, వీరికి రూ. 3 లక్షల వార్షిక వేతనం నిర్ణయించి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.చిరంజీవి అభినందించారు.

బాలికకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్‌కు చెందిన బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన హఫీజ్ మస్తాన్‌ను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి న్యాయం చేయాలని జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను మంగళవారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఘటనపై స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ మోబినా, పొట్నూరి శ్రీనివాసరావు, బొట్ట సాయి, బావిశెట్టి శ్రీనివాసరావు, బంగారు నూకరాజు, నోచర్ల పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్ యూనియన్ బ్యాంక్ శాఖను తరలించొద్దు



ప్రజాశక్తి-వన్‌టౌన్: లాభాల్లో వున్న యూనియన్ బ్యాంక్ మధురానగర్ శాఖను ఖాతాదారులకు అందుబాటులో లేని ప్రాంతం, మూడు కిలోమీటర్ల దూరంగా వున్న మాచవరం బ్రాంచ్‌లో విలీనం చేస్తే సుమారు 15 వేల మంది ఖాతాదారులు, వయోవృద్ధులు, పెన్షనర్లు, డ్వాక్రా గ్రూఫ్ పేద మహిళలు అనేక ఇబ్బందుపాలు కావాల్సి వస్తుందని మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి, ఆమె భర్త , మాజీ ఎన్‌జివో నాయకులు పివిఎల్ఎన్ రాజు, మధురానగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వై.వి. శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు, డ్వాక్రా మహిళలు కోనేరు మంజూల రాణి కలసి వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి వెళ్ళి రీజనల్ హెడ్ యు.వి. రజనీకాంతరావు, డెప్యూటీ రీజనల్ హెడ్ పివిజె నరసింహమూర్తి, జనరల్ మేనేజర్ ఎఫ్.జి.ఎం.ఓ. నవనీత్ కుమార్‌కు మధురానగర్ శాఖను మాచవరం బ్రాంచ్‌కు తరలించవద్దని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీతులసీ మాట్లాడుతూ మధురానగర్ నుండి మాచవరం వెళ్ళాలంటే మధురానగర్ రైల్వేస్టేషన్ పక్కన నాలుగు సంవత్సరాల నుండి నిర్మాణంలో వున్న రోడ్ అండ్ బ్రిడ్జి ఆగిపోయాయని, దీంతో సిటీ బస్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. తాత్కాలికంగా నిర్మించిన కచ్చా రోడ్డు గుంతలు పడి కంకర బయటపడి సైకిళ్ళు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మధురానగర్ రైల్వేస్టేషన్ ఉండటం వలన ప్రతిరోజూ 70 నుండి 80 సార్లు రైల్వే గేటు పడుతుండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నట్లు చెప్పారు. కచ్చా రోడ్డు వల్ల ఆటోలు రావటం లేదని, వచ్చినా అధిక రేట్లు వసూలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లాభాట బాటలో వున్న మధురానగర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఇక్కడి నుండి మార్చవద్దని వన్‌టౌన్ యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం అధికారులు దృష్టికి తీసుకురావటంతో ముంబై ప్రధాన కార్యాలయ అధికారులకు ఈ విషయం తీసుకువెళ్ళనున్నట్లు వారు తెలిపినట్లు లక్ష్మీతులసి తెలిపారు.

అత్యాచార బాధితురాలికి అండగా ఉంటాం : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన హఫీజ్ మస్తాన్‌పై కఠిన చర్యలు వుంటాయని, బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటానని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలికను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ హఫీజ్ మస్తాన్ అనే నిందితున్ని పట్టుకొని కఠినమైన చర్యలు తీసుకునే విధంగా దిశా చట్టం అమలయ్యే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక 56వ డివిజన్ కార్పొరేటర్ యలకల చలపతిరావు, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి, వాసబాబు, రబ్బానీ, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజిద్ ఖాన్ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘటనపై వెస్ట్ ఏసిపి హనుమంతరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆయుర్వేదంతో అన్ని రకాల వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆయుర్వేద వైద్యంతో అన్ని రకాల వ్యాధులు నయం చేయవచ్చని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా 'సాధనకు మూడు స్తంభాలు -ఆయుర్వేదం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది ఒక ఆధునిక శాస్త్రమన్నారు. ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులను సైతం తగ్గించవచ్చని, ఇది చాలా తక్కువ ఖర్చుతో కూడిన వైద్యమని వారు పేర్కొన్నారు. ఆయుర్వేదం విశిష్టతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జె.లక్ష్మీనారాయణ, సెక్రటరీ పి.లక్ష్మణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతాంజలి శాస్త్రి, ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. ఎ.రమాదేవి పాల్గొన్నారు.





ఉపాధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-నందిగామ: గ్రామాలలో గుర్తించిన ఉపాధిపనులు ఆమోదించి తక్షణమే పనులు చేపట్టాలని మండల అధికారులు కోరారు. మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాలలో గుర్తించిన పనులను దాములూరు, రామిరెడ్డిపల్లి, తొర్రగుడిపాడు, సోమవరం, పంచాయతీలలో ప్రణాళిక ప్రకారంగా ఆమోదించటం కొరకు ఆయా సంబంధిత గ్రామ సర్పంచులు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ రమాదేవి, తొర్రగూడిపాడు సర్పంచ్ చెరుకూరి హైమారావు, రామిరెడ్డిపల్లి సర్పంచ్ చెరుకూరి హైమారావు, దాములూరు సర్పంచ్ గాదెల రామారావు, సోమవరం సర్పంచ్ వెంకట నారాయణ, కొణతమాత్మకూరు సోసైటీ చైర్మన్ లగడపాటి వీరయ్య, నందిగామ క్లస్టర్ ఎపిడి కె.మణికుమార్ పాల్గొన్నారు.

వరల్డ్ టౌన్ ప్లానింగ్ డే వేడుకలు

ప్రజాశక్తి-తిరువూరు: స్థానిక శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశా లలో వరల్డ్ టౌన్ ప్లానింగ్ డే వేడుకల ను మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు సమాజంలో సివిల్ ఇంజనీరింగ్ ప్రాము ఖ్యతను తెలియజేశారు. టౌన్ ప్లానిం గ్ అండ్ డెవలప్మెంట్ గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వూటుకూరి సుబ్రహ్మణ్యం, కోశాధికారి పోలిశెట్టి లీలా గోపాలకష్ణ మూర్తి, సివిల్ విభాగాధిపతి వై.సోంబాబు, అధ్యాపకులు, తిరువూరు మండ ల వార్డ్ ప్లానింగ్ రేగులాటిన్స్ సెక్రెటరీస్ ఎం.ఆరాధనరావు, బి.శ్రీనివాస్, సిహె చ్. సందీప్, టి. పావని, టి.సాయిరూప విద్యార్థులు పాల్గొన్నారు.



పోర్టు నిర్మాణం ప్రకటనలకే పరిమితం : కొల్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రకటనలు దాటి ముందుకు వెళ్లడం లేదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపి బాలశౌరి,ఎం ఎల్ఎ పేర్ని వెంకట్రామయ్య (నాని)లు వారికి గుర్తొచ్చి నప్పుడు అదిగో, ఇదిగో పోర్టు, పనులు ప్రారంభిస్తున్నామంటూ హడావుడి చేస్తుంటారన్నారు. ఈ మూడున్నర సంవత్సరాల్లో ఒక్క అంగుళమైనా నిర్మాణ పనులు చేశారా? అని ప్రశ్నించారు. గత టిడిపి ప్రభుత్వంలో భూముల సేకరణ, రైతులకు డబ్బులు చెల్లింపు, నవయుగ సంస్థతో పనులు ప్రారంభించటాన్ని సమర్ధవంతంగా చేయగలిగామన్నారు. గత ప్రభుత్వంలో తమ ప్రభుత్వం మొదటి ఫేజ్‌లో 12 జెట్టీలను ఏర్పాటుచేశామన్నారు. ఇప్పుడు కేవల ఆరు జెట్టీలను కొనసాగిస్తామంటున్నారన్నారు. రాష్ట్రం మొత్తం మేఘారెడ్డి చేతుల్లోనే పెట్టారనీ, ఇప్పుడు బందరు పోర్టును కూడా పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రోడ్డు కాం రైల్వే రోడ్డుకు ముడా ద్వారా రూ.100 కోట్లు ఇమ్మంటే దిక్కులేదన్నారు. ఇప్పుడు రూ.4000 కోట్లు తెస్తామని వాగ్దానాలు చేస్తున్నారన్నారు. దాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని పాలకులు గమనించాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో కార్తీక మాసం పౌర్ణమి సమయంలో లక్షల్లో వచ్చే సందర్శకులు ఈ ప్రభుత్వం చేస్తున్న చేష్టలతో కనీసం 200 మంది కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. బీచ్ లో గల్లంతైన బాలుడి ఆచూకీ కనుగొనడంలో యంత్రాంగ విఫలమైందన్నారు. మంగినపూడి బీచ్‌లో అధికారుల నిర్లక్ష్యం వల్ల 14 సంవత్సరాల యువకుడు చనిపోగా, మృతదేహాన్ని తీసుకెళ్లటానికి అంబులెన్స్ లేక బండిపై తీసుకెళ్లాల్సివచ్చిందన్నారు. ఈ సంఘటనను పోస్ట్ చేసిన మీడియ వారిని స్థానిక డిఎస్పీ బెదిరిస్తుండటం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు,వెంకన్న, ఇలియాస్ పాషా, కార్పొరేటర్ సమత కీర్తి, పార్టీ నాయకులు నారాయణ ప్రసాద్, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. .

కేరళ తరహాలో కూలీలకు వేతనాలివ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి-ఘంటసాల

కేరళ రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లిస్తున్నారని, ఆ తరహాలో ఆంధ్రప్రదేశ్ లో ఉపాధి కూలీలకు వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యద్ధనపూడి మధు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల రెండో మహాసభ కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాలలోని క్రిస్టియన్ పేటలోని కమ్యూనిటీ హాలు వద్ద



వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

జరిగింది. మధు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని, జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలతోపాటు దశ రత్నంగా పేదలకు భూమి పంపిణీ చేయాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు మేరకు ప్రతీ కుటుంబానికి 2 ఎకరాలు భూమి పంచాలని డిమాండ్‌చేశారు. మొవ్వ మండలం కూచిపూడిలోని శాంతి కాంప్లెక్స్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే ఎపి వ్యకాస కృష్ణాజిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, రైతు నాయకులు కొండపల్లి శ్రీకాంత్, గొరుముచ్చు వెంకటేశ్వరరావు, భలే రాజశేఖర్, మల్లంపల్లి రాజకర్. గరికపాటి నాగవేణు, గూడపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల అధ్యక్షులుగా గూడపాటి బాబురావు, కార్యదర్శిగా మేడంకి వెంకటేశ్వరరావు, సభ్యులుగా కటికల ప్రసాద్ గొరుముచ్చు వెంకటేశ్వరరావు, వెనిగళ్ల నాగమణి ఎన్నికయ్యారు. వాకా రామచంద్రరావు, కొండపల్లి శ్రీకాంత్‌లు సందేశాలు ఇచ్చారు.

10, 11 తేదీల్లో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాపరెడ్డి కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.00 వరకు జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు, ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ, జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలలో గర్భవతులకు బాలింతలకు శిశువులకు పౌష్టికాహారం పంపిణీ, ప్రధానమంత్రి మాతృ వందన పథకాల అమలు పరిశీలిస్తారు .11న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వివిధ సంక్షేమ పథకాలు అమలు పురోగతి సమీక్షిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న విసి చంద్రశేఖర్

క్రీడా ఖ్యాతిని పెంపొందించాలి

స్పోర్ట్స్ బోర్డ్ కమిటీలో విసి కె.బి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

వినూత్నంగా అనేక అంశాల్లో ప్రత్యేక క్రీడాంశాలు, పోటీలను నిర్వహించటం ద్వారా రాష్ట్రంలోనే యూనివర్శిటీ ప్రతిభను మరింతగా పెంచటానికి కృషిచేయాలని కృష్ణా యూనివర్శిటీ వైస్ ఛాన్సిలర్, స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ ఆచార్య కె బి చంద్రశేఖర్ కోరారు. మంగళవారంనాడు యూనివర్శిటీలో జరిగిన స్పోర్ట్స్ బోర్డు కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వార్షిక బడ్జెట్ ఆమోదించారు. అనంతరం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్శిటీలోని విద్యార్థులను క్రీడల్లో నైపుణ్యం సాధించే దిశగా, కేంద్ర రాష్ట్రస్థాయిలో వివిధ టోర్నీల్లో పాల్గొని వర్శిటీకి పేరు ప్రఖ్యాతలు సాధించే విధంగా ప్రోత్సహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. వర్శిటీ రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ ట్రెజరర్ ఆచార్య ఎం.రామిరెడ్డి మాట్లాడుతూ క్యాలెండర్లో పొందుపర్చిన ప్రతి కార్యక్రమాన్నీ వినూత్నంగా రూపొందించి నిర్వహించాలన్నారు. తద్వారా వర్శిటీని అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు, స్పోర్ట్స్ బోర్డ్ కన్వీనర్, సెక్రటరీ డాక్టర్ ఆర్ కిరణ్ కుమార్, హైదరాబాద్ జేఎన్టీయూ నుండి,విజయవాడ , చుట్టుపక్కల కళాశాలలకు సంబంధించి ఈస్ట్ జోన్ ,వెస్ట్ జోన్ కమిటీ చైర్మన్లు, కన్వీనర్లు , పలువురు మెంబర్లు కూడా పాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

ఈ నెల 10,11 తేదీల్లో గుడివాడలో జరగనున్నఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 7వ రాష్ట్ర మహాసభల్లో నిర్మాణ రంగ కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాలరావు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక జ్యోతి రావు పూలే విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గోపాలరావు మాట్లాడారు. ఇసుక సమస్యతో నిర్మాణదారులు (బిల్డర్లు, కాంట్రాక్టర్లు) అధిక వ్యయం చేయాల్సి రావడంతో నిర్మాణం



భారమైందని దీంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. రాష్ట్రంలో ఇసుక క్వారీలన్ని తెరిపించి ఇసుక అందుబాటు ధరలలో వుండేలా చర్యలు తీసుకోవాలనీ, నిర్మాణ మెటీరియల్ సిమెంట్, ఐరన్, కలప, హార్డ్వేర్, రంగులు మొదలగు వాటి ధరలు అందుబాటులో వుండే విధంగా నియంత్రించి, నిర్మాణ భారం తగ్గించాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులను నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కోసం ఈనెల 10,11 తేదీల్లో గుడివాడలో జరిగే ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో బి.అంకబాబు, జిల్లా నాయకులు బండారు శ్రీనివాసరావు, జె.పౌల్, ఎండి అక్బర్, సిఐటియు రూరల్ కార్యదర్శి సిహెచ్ జయరావు తదితరులు మాట్లాడిన వారిలో ఉన్నారు.

క్విజ్‌లో సెయింట్ జాన్స్‌కు ప్రథమస్థానం

ప్రజాశక్తి-గన్నవరం

ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ మౌంట్ పోర్టు స్కూల్స్ ఇంటర్ ప్రావిన్స్ చాంఫియన్ క్విజ్ పోటీలు ఇటీవల హైదరాబాద్ అబిడ్స్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో



క్రీడాకారులను అభినందిస్తున్న సంతోష్‌కుమార్ తదితరులు

స్థానిక వివిస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో రెవ. జిమ్మీ కురియోకోస్, సూర్యనారయణ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన 10వ తరగతి విద్యార్థులు ఎ.భార్గవ్, వి. శ్రేయాన్ సూరజ్ లు పాల్గొన్నారు. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా నెలకొనియున్న మాంట్ పోర్టు 8 ప్రావిన్స్‌ల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో ఆద్యంతం మిక్కిలి ఉత్కంఠగా కొనసాగిన తరువాత హైదరాబాద్ ప్రావిన్స్ తరుపున పాల్గొన్న తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారని వారికి రూ.10 వేలు నగదు బహుమతి, రోలింగ్ ట్రోఫీ, బంగారు పతకాలను అందజేశారని పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ సంతోష్ కుమార్ వెల్లడించారు. రెవరెండ్ బ్రదర్ భల్లాజోసఫ్, ఉపాధ్యాయులు విద్యార్థులు వారిని అభినందించారు.

కొమ్మారెడ్డి విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి

ఈనెల ఆరోతేదీన మంగళగిరిలో 7వ జాతీయ ఇన్విటేషనల్ కరాటే చాంఫియన్‌షిప్ 2012ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 4వ తరగతి చదువుతున్న వై.షణ్ముఖ శ్రీ, అంజని 10 సంవత్సరాల



కటా విభాగంలో బంగారు పతకాన్ని, 8వ తరగతి చదువుతున్న బి.చాతుర్య 13 సంవత్సరాల కటా భాగంలో బంగారు పతకాలు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరాటే మాస్టర్ డాక్టర్ సుజ్ఞానం వెంకటేశ్వరరావు,ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు.

పాములపాడులో గ్రామసభ

ప్రజాశక్తి-పెదపారుపూడి

మండలంలోని పాములపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం అమలు తీరుపై మంగళవారం గ్రామ సభ జరిగింది. సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్‌రావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులకు కల్పించటమే లక్ష్యంగా కృషిచేస్తున్నామన్నారు. గ్రామంలో 2023-24 పనులు గుర్తించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు ప్రకారం గుర్తించిన పనులను ఆమోదించారు. జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయడానికి లబ్ధిదారులతో హౌసింగ్ ఎఇ మల్లికార్జునరావు సమావేశమయ్యారు. పంచాయతీ అభివృద్ధి విషయమై ఆయా శాఖల అధికారులతో ఎంపీడీవో సమావేశమై తగు సూచనలు, సలహాలు అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అశోక్ కుమారి, ఈవో పి ఆర్ డి నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాగర్‌రాణి, ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ ఏపీవో స్ఫూర్తి, వీఆర్వో ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ టి.సీతామహాలక్ష్మి



అవార్డు పొందిన సరస్వతిని అభినందిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, చిత్రంలో బాలిక తల్లిదండ్రులు

అవార్డు సాధించిన విద్యార్థినికి మేయర్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ : తమిళనాడు, వెల్లూర్, సిరిపురంలోని శ్రీ లక్ష్మీనారాయణి గోల్డెన్ టెంపుల్‌లో ఈనెల 6న జరిగిన శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఏడవ జాతీయ స్థాయి నంది డాన్స్ పెస్టివల్ విభాగంలో విజయవాడకు చెందిన మోదుకూరి బాలసరస్వతి అవార్డు సాధించింది. వన్‌టౌన్ కొత్తపేటలో గల ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి బాలసరస్వతి కూచిపూడి ప్లేట్ డాన్స్ విభాగంలో శ్రీ నారాయణి నంది అవార్డ్ సాధించింది. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిని బాలసరస్వతి, ఆమె తల్లితండ్రులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విజేతగా నిలిచిన చిన్నారిని మేయర్ అభినందించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బాలికకు శిక్షణ కల్పించిన కోచ్‌ను అభినందించారు.

ఇ వేస్ట్‌పై అప్రమత్తత అవసరం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



కారక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) భవిష్యత్‌పై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ఇ-వేస్ట్ నిర్వహణపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల, జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తం ఆధ్వర్యాన మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కలెక్టర్ డిల్లీరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో అవగాహన పెంచుకుని కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, సిడిలు, బ్యాటరీలు, ఎల్‌ఇడి బల్బులు వంటి వస్తువులు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. ఇవి పాడైనప్పుడు చెత్తకుండీలు, డ్రైనేజిలలో వేయకూడదన్నారు. అలా వేస్తే అవి సమీపంలోని కాల్వల ద్వారా నదులు, సముద్రంలో కలిసి జలచరాలు కాలుష్యానికి గురవుతున్నాయని, వాటిని ఆహారంగా తీసుకునే ప్రజలు కాలుష్యకోరలకు చిక్కుతారని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో ఉండే లెడ్, కార్డియం, మెర్క్యురీ వంటి రసాయన పదార్థాల వలన కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసదస్సులో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, సిద్దార్థ మహిళ కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపల్ ఎస్.కల్పన పాల్గొన్నారున.

అఘాయిత్యానికి గురైన చిన్నారికి కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ : చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడుని కఠినంగా శిక్ష పడేలా చూస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. అఘాయిత్యానికి గురై పాత ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన చిన్నారిని మంగళవారం కలెక్టర్ ఎస్‌డిల్లీరావు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభంశుభం తెలియని చిన్నారిపై కామాంధుడు అఘాయిత్యానికి పాల్పడడం అత్యంత దురదృష్టకరమన్నారు. సభ్య సమాజం తలదించుకునే ఇటువంటి సంఘటన జరగడం మనసును కలిచివేస్తోందన్నారు.

అపరాధ రుసుం విధింపు

ప్రజాశక్తి - విజయవాడ : మేజిస్ట్రేట్ యు.రామమోహనరావు ఆధ్వర్యాన జోనల్ కమిషనర్ - 2 కార్యాలయంలో మంగళవారం సర్కిల్-2కు సంబంధించిన హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మొత్తం 22 ఎస్‌టిసి కేసులు నమోదు చేశారు. ఈ కేసుల ద్వారా మొత్తం రూ.10,160 అపరాధ రుసుం వసూలు చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేని, పశువులను రోడ్లపై కట్టిన, రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా విధించారు.

రేపటితో పాస్టర్ల గౌరవ వేతనం దరఖాస్తుకు గడువు పూర్తి

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనం పొందటానికి జిల్లాలోని అర్హులైన పాస్టర్లు ఈనెల 10వ తేదీలోపు స్థానిక సచివాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను అన్‌లైన్‌లో మాత్రమే పంపాలని కోరారు. అర్హులైన పాస్టర్లకు ప్రతి నెలా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు.

డాక్యుమెంటు పోయినవి

ఎన్టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామ కాపురస్తులు గింజుపల్లి సైదేశ్వరరావు తండ్రి అప్పారావుకు చెందిన డాక్యుమెంటు పోయినది. నవాబుపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.328/1ఎలో మా తండ్రి గారైన అప్పారావు గారికి 1.94 సెంట్ల భూమి కలిగి ఉన్నది. దానిని మా నాన్న గారు 1996 సంవత్సరంలో పూర్తి హక్కులతో నాకు వ్రాసి ఉన్నారు. దానికి సంబంధించిన దస్తావేజు పోయినవి. సదరు దస్తావేజు దొరికిన వారు సెల్ నెం. 9666674062 కు సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
గింజుపల్లి సైదేశ్వరరావు, తండ్రి అప్పారావు,
నవాబు పేట గ్రామం, పెనుగంచిప్రోలు మండలం,
ఎన్టిఆర్ జిల్లా.

మొదటి పేజీ తరువాయి



దుర్గగుడిని మూసివేస్తున్న ఇఒ భ్రమరాంబ

కనువిందు

5 గంటల నుండి రావాల్సిన గ్రహణం 6 గంటల నుండి కనిపించింది. గ్రహణాన్ని వీక్షించిన వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సంవత్సరంలో చివరి గ్రహణం కావడంతో ప్రజలు ఆసక్తి కనబరిచారు. టెలిస్కోపుల ద్వారా వీక్షించే ఏర్పాట్లు చేసిన డాక్టర్ రాధాకృష్ణ, స్వాన్, పత్మ, ఉమాలకు భవానీపురంలోని రీజనల్ సైన్స్ సెంటర్ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దుర్గగుడి మూసివేత

పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా విజయవాడ కనక దుర్గమ్మ ఆలయాన్ని మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుల సమక్షంలో ఇఒ డి.భ్రమరాంబ మూసివేశారు. ఉదయం 8 నుంచి ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలను మూసివేశారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు ఆలయాలను శుద్ధిచేసి దేవతా విగ్రహాలకు స్నపనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చన, మహానివేదన, హారతి ఇచ్చి మరోసారి ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలను మూసివేశారు. ఉదయం 8 గంటలలోపు ఉన్న సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, గణపతి హోమం, నవగ్రహ శాంత్రి హోమం, రుద్రహోమాలకు మాత్రమే అధికారులు అనుమతించారు. తర్వాత ప్రారంభమయ్యే లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం, శ్రీ చక్ర నవావరణార్చన, చండీహోమం, పంచ హారతులు, పల్లకీ సేవ తదితర సేవలను రద్దు చేశారు. బుధవారం ఉదయం యథావిధిగా అన్ని దర్శనాలు, ఆర్జిత సేవలు పునః ప్రారంభమవుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

ఫిష్ రిటైల్ అవుట్లెట్లు ఏర్పాటు

ఎంపిక చేస్తున్నామన్నారు. రూ.20 లక్షలతో ఇన్సులేటెడ్ వాహనాల ఏర్పాటుకు 6 దరఖాస్తులను, ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్ మోటర్ సైకిల్‌కు 163 దరఖాస్తులను, త్రీ వీలర్ మోటర్ సైకిల్‌కు 74 దరఖాస్తులకు ఆమోదించనున్నట్లు తెలిపారు. ఫిష్ ఆంధ్ర కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న మత్స్య సంపద ఉత్పత్తికి మత్స్యకారులను ప్రోత్సహించాలన్నారు. లైవ్ ఫిష్ అమ్మకాలపై ప్రజలు మక్కువ చూపుతున్నారన్నారు. మత్స్య అవులెట్ల ఏర్పాటుకు నగరంలో ఇరిగేషన్, ఆర్‌టిసి, నగరపాలక సంస్థ, మార్కెటింగ్, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ వంటి ప్రభుత్వ శాఖల ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు. ఆయా శాఖల నుండి అద్దె ప్రాతిపదికన స్థలాలను సేకరించి మత్స్య ఫెడరేషన్ ద్వారా అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకాశం బ్యారేజి ఎగువన కృష్ణానదిలో 20 లక్షల చేప పిల్లల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. అవి పెరిగిన అనంతరం దాదాపు 1500 మంది మత్స్య కుటుంబాల వారు చేపలను వేటాడడం ద్వారా ఆర్థిక లబ్ది పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈసమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి ఎ.నాగరాజా, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయభారతి, డిఆర్‌డిఎ ఎన్.కిరణ్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రుక్మాందయ్య, ఎల్‌డిఎం పి.కోటేశ్వరరావు, పిఎంఎస్ డైరెక్టర్ లంకె గోవిందరాజులు, ఎడి సిహెచ్.చక్రాణి, ఎఫ్‌డిఒలు పి.అఖిల, కె.నాగబద్ర, బి.లెనిన్‌బాబు పాల్గొన్నారు.

విమానాశ్రయ నిర్వాసితుల ధర్నా

రప్పించాలని బాధిత మహిళలు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ పాల్గొని సంఘీభావం తెలిపారు. విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. సిఐటియు మండల నాయకులు బడుగు మరియదాసు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువీధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ అధికారులు నిరసనకారులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.



పోలీసుల మోహరింపు

మహారాజశ్రీ విజయవాడ 1 అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి 322/2019 ఇన్ ఓ.యస్.360/2014

సప్తగిరి గ్రామీణబ్యాంకు, విజయవాడ-2
...డి.హెచ్.ఆర్

మరియు

1.గనుపల్లి పవన్ కుమార్, తండ్రి కోటేశ్వరరావు, డిప్యూటీ తాహసిల్దార్, అసిస్టెంటు సివిల్ సప్లై ఆఫీసు, ఎఎస్ఒ సర్కిల్, గాంధినగర్, విజయవాడ-520003.
...జె.డి.ఆర్ నెం.1

పై నెంబరు ఇ.పి యీ జెడిఆర్ కు ఆర్21, ఆర్22 నోటీసు నిమిత్తము 15-11-2022కు వాయిదా అయి వున్నది. కాన వాయిదా రోజు వుదయం 10-30ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్నచో తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు
మందపాటి బసవారెడ్డి,
డిహెచ్‌ఆర్ తరుపు అడ్వకేటు,
విజయవాడ-520002.

నోటీసు
మహారాజశ్రీ విజయవాడ 8 వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
I.A.No. 761/2022 in O.S.No.374/2012

Between:
Boppana Seema ...Petitioner
And
Kandimalla Chandra Sekhar Reddy & Others ...Respondents
To
G.Srirama Chandra Murthy, S/o Subbarao,
D.No.26-4-56, Gandhi Nagar, Vijayawada.

ఈ నెంబరు పిటీషన్‌లో మీరు ది.14-11-2022 ఉదయం గం10-30ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును అని యిందుమూలముగా తెలియజేయటమైనది.

ఇట్లు
Smt K.Sarala Benarjee,
Advocate,
Vijayawada.

పొలం డాక్యుమెంట్స్ పోయినవి

చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామానికి చెందిన నాదెళ్ల గురు వెంకటరమణరావు ఆర్‌ఎస్ నంబర్ 135లో 01.34 సెంట్లు పొలం డాక్యుమెంట్ సెప్టెంబర్ 6వ తేదీ నడకదురు నుండి చల్లపల్లి వెళ్లే మార్గమధ్యంలో పోయినవి. ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో నాకు సమాచారం ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు
నాదెళ్ల గురు వెంకటరమణారావు,
సెల్ నంబర్. **9505132980**

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ కృష్ణాజిల్లా నందిగామ పదహారవ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో.
G.W.O.P.No: 22/2022

In the matter of sanction and permission to alienate the schedule immovable property pertaining to the minors:-

1)తుర్లపాటి శేష సాయి సుధన్వ తండ్రి:(లేటు) తుర్లపాటి రంగనాథ్ @వెంకట ఫణి రంగనాథ్, హిందు, వయస్సు 18సం॥లు మరియు

2)తుర్లపాటి శ్రీ కన్య సాయి క్రితిక్ తండ్రి:(లేటు) తుర్లపాటి రంగనాథ్ @వెంకట ఫణి రంగనాథ్, హిందు, వయస్సు 13సం॥లు.

Represented by their naturalguardian/next friend, mother, Turlapati Sri Harsha.

బిట్వీన్:-
తుర్లపాటి శ్రీ హర్ష ....పిటీషనర్
మరియు
తుర్లపాటి వెంకట శశికళాధర రావు ...రెస్పాండెంట్

పై నెంబరు జి.డబ్ల్యు.ఓ.పి.లో ఈ దిగువ షెడ్యూల్ మైనర్ల స్థిరాస్తిని విక్రయించుటకు మైనర్ల తల్లి గారైన పిటీషనర్ గారు పై కోర్టులో పర్మిషన్ నిమిత్తం పిటీషన్ ఫైల్ చేసినారు. పై కోర్టు వారి ఆదేశాలు మేరకు పబ్లిక్ నోటీసుకై పబ్లికేషన్ నిమిత్తం ది.01-12-2022వ తేదీకి వాయిదా అయి వున్నది. ఈ క్రింద మైనర్ కు సంబంధించిన షెడ్యూల్ ఆస్తి విక్రయము కొరకు ఆక్షేపణదారులు ఎవరైనా ఉన్న యెడల, ది.01-12-2022వ తేదీన ఉదయం గం10-30ని॥లకు పై కోర్టు వారి యెదుట స్వయముగా గానీ అడ్వకేటు గారి ద్వారా గానీ హాజరు అయి ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేయవలయును. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

<u>SCHEDULE OF PROPERTY FILED ON BEHALF OF THE PETITIONER.</u>

An extent of Ac.7-31 cents out of Ac.14-62 cents of land in R.S.No.255/1 situated in Adaviravulapadu village, Nandigama Mandal, within the SRO Nandigama, within the limits of District Registry area of Vijayawada and Registration District of Krishna within the following boundaries.

తూర్పు: వెంకట ఫణి రంగనాథ్ & ధూపగుంట నటరాజ్, దక్షిణం: వాగు, పడమర: వాగు, ఉత్తరం: తుర్లపాటి వెంకట కళాధర రావు.

(శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ది.03-11-2022,
నందిగామ.

ఇట్లు
కూనపరెడ్డి శ్రీనివాస రావు
పిటీషనర్/వాది తరపున అడ్వకేటు
మచిలీపట్టణం.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
బుధవారం 9 నవంబర్ 2022

భవనాల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను పేదలందరికీ సత్వరమే అందేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ బంగ్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

కాలనీలు, ప్రయారిటీ బిల్డింగుల నిర్మాణ పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు,ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్ తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలపై మండల, నియోజకవర్గ స్థాయి ప్రత్యేక, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ మండలవారిగా ఒక్కొక్క అధికారిని అడిగి తెలుసుకున్నారు. గ్రౌండింగ్, మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.

కరాటే క్రీడాకారులకు అభినందన

గన్నవరం : జాతీయస్థాయి కరాటే పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులు వీరే..

మంగళగిరిలో ఈద్ కమ్యూనిటీ హాలులో ఆదివారం కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ వారు నిర్వహించారు 1200 మంది బాల బాలికలు పాల్గొన్నారు. గన్నవరం నుండి అండర్ 12 విభాగంలో హాజరైన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచారు. అండర్ 12 విభాగంలో కె.హనీష్ వర్మ, జి.శ్రీనిధి, ఎం.మోహిత్, జె.రోషన్ ప్రథమ స్థానాల్లోనూ, కెహర్షిత, కె.చంద్రచుడ్, డి.మాన్య, సిహెచ్ రిత్విక్ ద్వితీయ స్థానంలోనూ, ఎ.మోహిని, టి.దీక్షిత, సిహెచ్ దీపక్, జె.గగన్ ఆర్య, డి.మద్విత, ఎన్.అక్షయ, కె.జోయర్ తతీయ స్థానంలో నిలిచారు. విజేతలందరినీ వాకర్స్ అసోసియేషన్ జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ ప్లే గ్రౌండ్ గన్నవరం అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖరరావు, కోశాధికారి గంపా సాంబశివరావు, ఉపాధ్యక్షులు సగ్గుర్తి శ్రీనివాసరావు, వాకర్స్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. కోచ్ ఉప్పులూరి వెంకట్రావుకు తల్లిదండ్రులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు నుండి ముదినేపల్లి వెళ్లే రహదారి ధ్వంసం కావడంతో దీనిపై ప్రజాశక్తి కృష్ణాజిల్లా మినీ ఎడిషన్‌లో అక్టోబర్ 24న 'అధ్వానంగా రహదారులు' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం ఆ రహదారికి మరమ్మతులు చేపట్టారు. దీనితో వాహనం చోదకులు సంతప్తి చెందారు.



అర్హులకు సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యం : జోగి

ప్రజాశక్తి-పెడన

పేదల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన పెడన పట్టణ మున్సిపాలిటీ రెండో సచివాలయం పరిధిలోని 6వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ కరపత్రాలను వారికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చే ముందు, ప్రజల కోసం ఏవైతే చేస్తానని తన సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారో వాటిని తూచా తప్పకుండా నెరవేర్చారన్నారు. అర్హులైన వారికి నవరత్నాలను అందించడంతోపాటు సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 1.34 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిచ్చి వారి కుటుంబాలలో జీవనజ్యోతి వెలిగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు జవాబుదారీతనంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి శ్రద్ధ తీసుకొని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకు పంపుతూ శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రజల బాగు కోసం మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి మరింత ప్రోత్సాహం



బుక్‌లెట్లు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

అందిస్తూ ఆశీర్వదించాలని మంత్రి ప్రజలను కోరారు. ప్రజల అభ్యర్థన మేరకు అవసరమైనచోట్ల సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.వృద్ధుడు కోట కృష్ణమూర్తి తనకు మూడు చక్రాల బండిని ఇప్పించాలని మంత్రిని కోరగా వెంటనే సమకూర్చేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యుడు మైలా రత్నకుమారి, 5వవార్డు కౌన్సిలర్ వైస్ ఛైర్మెన్ ఎం.డి. ఖాజా, 6వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యుం, 3వ వార్డు కౌన్సిలర్ బళ్ళా గంగయ్య, 4 వ వార్డు కౌన్సిలర్ రెహతున్నీసా, పెడన తహశీల్దార్ పి.మధుసూదనరావు, పెడన మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు బందారు మల్లిఖార్జునరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కన్జర్వేటర్ల పరీక్షకు ఏర్పాట్లు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో బుధ, గురు, శుక్రవారాల్లో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పరీక్ష జరగనున్నదని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్లో ఏపీపీఎస్సీ అధికారులు, వివిధశాఖల



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

అధికారులతో పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ కానూరులోని 100 అడుగుల రోడ్డులోని ఐయాన్ డిజిటల్ జోన్, సైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్లలో నందు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలవరకూ రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 2 సెంటర్లలోనూ మొత్తం 1,165 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఎఅభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ శారద, సెక్షన్ ఆఫీసర్ అంజనా, బందరు డిఎస్‌పి మాసుం బాషా, కో-ఆర్డినేషన్ తహసీల్దార్ ఎం.హరనాథ్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోడూరు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్పిసి - కుటుంబ వైద్యం) ను ప్రజలందరూ ఆదరించాలని అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ కంపెనీ మచిలీపట్నం డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్ళు కోరారు. అరబిందో కంపెనీ వారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న 104 సంచార వైద్య



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

శిబిరం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరాన్ని కోడూరు మండలంలోని లింగారెడ్డిపాలెం వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మచిలీపట్నం 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ 104 కష్ణాజిల్లా మేనేజర్ (డిఎం) సిహెచ్ శ్రీనివాస్ ఆదేశాలతో సందర్శించారు. ఇప్పటివరకు కొనసాగుతున్న 104 సంచార వైద్య శిబిరానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలులో భాగంగా మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నౌషీన్, 104 వైద్యాధికారి పి శ్రీరామ్ మహేష్ శిబిరంలో రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు మధుమేహ (షుగర్), రక్తపోటు (బిపి) పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు (ఆపరేషన్లు) చేయించుకున్న వారిని, క్యాన్సర్ పక్షవాతం లాంటి దీర్ఘకాలిక రోగాలతో ఇంటికే పరిమితమై వైద్యం కోసం ఎదురుచూస్తున్న రోగులను గుర్తించారు. 104 సంచార వైద్య బృందం అంతా వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలను అందించాలనేదే ఫ్యామిలీ పిజిషన్ కాన్సెప్ట్ ముఖ్య ఉద్దేశమని 104 ఓయీ అన్నారు. గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు ప్రజలకు దీనిపై అవగాహన కల్పించి విజయవంతం చేయాలన్నారు. ఈ శిబిరంలో 70 మందికి పైగా రోగులకు వైద్య సేవలను అందించారు. గ్రామంలో శిబిరానికి రాలేని వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలను చేశారు. ఈ కార్యక్రమంలో 104 డీఈవో కే.ధరణిజ, సిబ్బంది ఏ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ ఏఎన్ఎం ఏ ధనలక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి పి. వెంకటేశ్వరమ్మ , ఆశ కార్యకర్తలు జే. లలిత కుమారి, బి కరుణ కుమారి, ఎండి రజియా సుల్తానా, ఏ ప్రశాంతి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి-చల్లపల్లి

ఏపీ బిల్డింగ్, అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఏడో మహాసభలు జయప్రదం చేయాలని మంగళవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుండి బయలు దేరిన ర్యాలీ వైశ్య బజార్ మీదుగా మున్సిపల్ వీధి, ప్రధాన రహదారి, తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగింది. అనంతరం స్థానిక కూడలిలో నాయకులు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన గుడివాడలో జరిగే రాష్ట్ర



ర్యాలీలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

మహాసభలో జాతీయ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో భవన నిర్మాణ కార్మికుల సంఘ యూనియన్ గౌరవాధ్యక్షులు బొందలపాటి వెంకటేశ్వరరావు, ఎస్.నాంచారయ్య, కర్ర ఆనంద్ కుమార్, ముత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు మండల అధ్యక్షుడు మహమ్మద్ కరీముల్లా పర్యవేక్షించారు.

చండీహోమం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండాలమ్మ వారి దేవస్థానంలో మంగళవారం చండీ హోమం నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి చండీ హోమం ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం చంద్ర గ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటల నుండి అమ్మవారి దేవస్థానం మూసివేశామని ఆయన తెలిపారు.

వరహాలరావుకు నివాళి

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు

ప్రముఖ అభ్యుదయ దళిత రచయిత చిత్తజల్లు వరహాలరావు 5వ వర్ధంతిని గుడ్లవల్లేరులో మంగళవారం ఘనంగా



చితజల్లు వరహాలరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు

నిర్వహించారు. ఈ సందర్భంగా పెయింటర్స్, ప్లంబర్, తాపీ యూనియన్ ఆధ్వర్యంలో పెయింటర్స్ యూనియన్ అధ్యక్షులు రావాడ గోపాల్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు బివి శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్ణ, కుల వ్యవస్థ పోవాలని మనుధర్మ శాస్త్రం వల్ల దుష్పరిణామాలు తదితర అంశాలపై 30కిపైగా రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్ సీనియర్ అధ్యక్షులు బొగ్గువరపు కోటేశ్వరరావు, సిహెచ్ శివకృష్ణ, సిహెచ్ అజయ్, పళ్ళ లోకేష్, ఆర్.కిషోర్, కె.ప్రసాద్, జి.బ్రహ్మం, ఎం.జెమినీ, పి.శ్రీను, దార్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలం మల్లవోలు ముదిరాజ్‌పాలేనికి నిరుపేద కుటుంబానికి చెందిన పూల టాటాన్ చనిపోయాడు. ఆయన దహన సంస్కారాలకు మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.5000 ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ (ఏపి) పడవల మోహన్, త్రినాథ్, ప్రత్తిపాటి స్వామి, ముదిరాజుపాలెం పెద్దలు పాల్గొన్నారు.

20న మారథాన్ రన్



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగర ప్రజలకు చక్కటి ఆరోగ్యంతో పాటు, నడక పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో విజయవాడ రన్నర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నగరంలో 'విజయవాడ మారథాన్ రన్' నిర్వహించనున్నట్లు విజయవాడ రన్నర్స్ వ్యవస్థాపకులు మణి దీపక్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా మారథాన్ రన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర వాసుల నుండి అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. అయితే గత రెండేళ్లుగా కరోనా కారణంగా వర్చువల్ రన్ నిర్వహించామని దీనిలో కూడా నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. అయితే ఈసారి కరోనా తరువాత పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని ఇప్పటికే రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మారథాన్ రన్‌లో 5కె రన్, 10కె రన్, 21కె విభాగాలుగా జరుగుతుందని తెలిపారు. రన్ ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఎం.జి.రోడ్డులోని 'డి' అడ్రస్ మాల్ వద్ద ప్రారంభించనున్నట్లు తెలిపారు. రన్‌లో పాల్గొనే వారికి టి షర్టు, గూడీ బ్యాగ్, బిబ్ టైమింగ్ చిప్ విత్ లైవ్ ట్రాకింగ్, ఇ సర్టిఫికెట్, రేస్ డే పిక్చర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని వివరాలకు 97035 52326 లేదా 73306 44528 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు డాట్ విజయవాడ రన్నర్స్ డాట్ కామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉదయభాను



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఏడవ వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.12 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు అతి త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని, నిర్మాణ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా స్థానికులు అంగీకారంతో రోడ్డును విస్తరించి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), కౌన్సిలర్ పుసాల సీతారావమ్మ, పుల్లారావు, కటాగాని నరసింహారావు, తోట శంకర్, కాసర్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. షేర్ మొహమ్మద్‌పేట గ్రామానికి చెందిన యలమందల సత్యం ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మృతిచెందారు. మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన వారి కుటుంబ సభ్యులకు రూ.7 లక్షలు అందజేశారు. పట్టణంలోని 4, 5 సచివాలయ పరిధిలోని 11, 12 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గృహాలకు 30 ఏళ్లుగా ఇళ్ల పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారు, రిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల లోన్లు కూడా రావడంలేదని ప్రజలు తెలిపారు. అనంతరం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన వుట్ల వీరభద్రరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.40 లక్షలను లబ్ధిదారునికి ఎమ్మెల్యే అందజేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఎ.కొండూరు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ద్వేష భావాన్ని పెంచుతూ సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించాలని చూస్తుందని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ అన్నారు. మంగళవారం మండలంలోని చీమలపాడు మెయిన్ సెంటర్‌లోని సుందరయ్య స్థూపం వద్ద సిపిఎం గ్రామ కార్యదర్శి పానెం ఆనందరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు అండగా ఉన్నాయన్నారు. దేశంలోని నిరసన స్వరాలను అణిచి వేసేందుకు బిజెపి ప్రభుత్వం అన్ని రకాల అస్త్రాలను ఉపయోగిస్తుందని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతుందని, పార్లమెంటరీ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందని, రాబోయే రోజుల్లో ఎర్రజెండా ఆధ్వర్యంలో మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు విప్లవస్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, అమ్మిరెడ్డి, ఎస్.సోములు, పంబి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రివైజ్డ్ పెన్షన్ ప్రతిపాదనలు త్వరగా పంపాలి : యుటిఎఫ్



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రివైజ్డ్ పెన్షన్ ప్రతిపాదనల ఆమోదిత ఉత్తర్వులు కాపీలు త్వరితగతిన పంపాలని ఎన్‌టిఆర్ జిల్లా డిటివో కార్యాలయం ఏటివో రమణకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగాయుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ జిల్లాలోని ట్రెజరీ అధికారులకు త్వరితగతిన డిటివో కార్యాలయం నుండది వచ్చిన ఉత్తర్వులు వెంటనే పంపాలన్నారు. డిఇవో కార్యాలయంలో సర్వీస్ రెగ్యులరైజేషణ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో గల ఎస్‌జిటి, ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంలు రెగ్యులర్, రివైజ్డ్ పెన్షన్ ప్రతిపాదనలు విజయవాడ లోకల్ ఫండ్ ఆడిట్‌కు మాత్రమే పంపాలన్నారు. మచిలీపట్నంకు పంపాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భూ హక్కు అమలుపై అవగాహన

ప్రజాశక్తి-ఎ.కొండూరు: జగనన్న శాశ్వత సంపూర్ణ భూ హక్కు పథకం అమలు పై మంగళవారం మండలంలోని మారేపల్లి గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారిణి డ్వామా పిడి జె.సునీత సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ పథకం కింద కూలీలు పనిచేసే పని విధానాన్ని పరిశీలించారు. అనంతరం పోలిశెట్టిపాడు గ్రామంలోఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను సందర్శించి క్లాప్ మిత్రాల పని తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధిక, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపిఎం రామారావు, పంచాయతీ కార్యదర్శి మిద్దే భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.





కరాటే పోటీల్లో 'శారద' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మొగల్‌రాజపురంలోని శారద విద్యాసంస్థల విద్యార్థి జె.మోహన్‌సాయి జాతీయస్థాయి ఆహ్వానపు కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించాడని కళాశాల జనరల్ మేనేజర్ జి.వి.రావు అన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థిని మంగళవారం కళాశాల ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయ స్థాయి ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న ఎంపిసి విద్యార్థి జె.మోహన్‌సాయి ప్రథమ స్థానం సాధించడంతో పాటు బ్లాక్ బెల్ట్ సాధించాడని తెలిపారు. మోహన్‌సాయిని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, అడ్వైజర్ ప్రసాద్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.



నిడమానూరులో వంశీ పర్యటన

ప్రజాశక్తి-విజయవాడరూరల్

రూరల్ మండలంలోని నిడమానూరు గ్రామ పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, వైసిపి నాయకులు పరిమి వంశీ, జడ్పిటిసి సువర్ణ రాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు

ప్రజాశక్తి-నందిగామ

మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం గ్రామంలో రూ.10 లక్షల అంచనా విలువతో 'జల జీవన మిషన్' ద్వారా ఇంటింటికి కుళాయి పథకంలో భాగంగా చేపట్టనున్న వాటర్ లైన్ ఏర్పాటు పనులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. .ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇంటింటికి సురక్షితమైన మంచినీటిని అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని, జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్లు అందిస్తామని తెలిపారు.

విఒఎను విధుల్లోకి తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-మైలవరం: జి.కొండూరులో విఒఎగా పనిచేస్తున్న ప్రమీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యర్శి డివి కృష్ణ డిమాండ్ చేశారు. దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన ప్రమీలను ఆ గ్రామ సర్పంచ్ ఇటీవల దుర్భాషలాడి అసభ్యపదజాలంతో చేతులతో నెట్టడంతో గాయాలపాలై మైలవరం ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతుంది. మంగళవారం డివి కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు ప్రమీలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమీలపై దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్.రమేష్, నాయకులు చాట్ల సుధాకర్, రావుల సుబ్బారావు, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమీలను పరామర్శిస్తున్న డీవీ కృష్ణ, పీవీ ఆంజనేయులు

వెల్వడంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం

మండలంలోని వెల్వడం గ్రామ సచివాలయం-1లో ఆధార్ సేవా కేంద్రాన్ని సర్పంచ్ పత్తిపాటి ధర్మరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధార్ కార్డులో సవరణలు, మెబైల్ నంబర్ లింక్, బయోమెట్రీక్ అప్‌డేట్ తదితర సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.